క్లుప్తంగా

కావలి డివిజన్‌లో 243.2 మి.మీ వర్షపాతం

కావలి : వాయుగుండం ప్రభావంతో కావలి డివిజన్ పరిధిలో గురువారం ఉదయం వరకు 243.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందని కావలి ఆర్డీఓ ఎం వంశీకృష్ణ తెలిపారు. జలదంకి 34.6, కావలి 48.4, బోగోలు 15, కలిగిరి 25.8, వింజమూరు 23.6, దుత్తలూరు 18.6, దగదర్తి 12.4, అల్లూరు 10.2, విడవలూరు 27.4, కొడవలూరు 27.2 మి.మీ నమోదైనట్లు వివరించారు.

సన్మానం



ఆత్మకూరురూరల్: స్థానిక ఆర్టీసీ డిపో గ్యారేజీలో పనిచేస్తూ బదిలీపై వెళ్తున్న కోచ్ బిల్డర్ విజయ్ కుమార్, మెకానిక్‌లు మధుసూదన్‌రావు, సురేష్‌ను ఆర్టీసీ అధికారులు, సిబ్బంది గురువారం ఘనంగా సన్మానించారు. డిపో మేనేజర్ కరీమున్నీసా, అసిస్టెంట్ మేనేజరు కల్పన కార్మికులను సత్కరించి వారి సేవలను కొనియాడారు. ఆర్టీసీ ఉద్యోగ సంఘాల నాయకులు మేకపాటి చిన్నారెడ్డి, సుబ్బారావు పాల్గొన్నారు.

మండల సర్వసభ్య సమావేశం వాయిదా

వింజమూరు(ఉదయగిరి): వింజమూరు మండల పరిషత్ కార్యాలయంలో గురువారం జరగాల్సిన మండల సర్వసభ్య సమావేశం వాయిదా పడింది. ఎంపీపీతో పాటు పలువురు ఎంపీటీసీ సభ్యులు సమావేశానికి హాజరు కాలేదు. దీంతో కోరం లేక వాయిదా వేసినట్లు ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి తెలిపారు.

విద్యుత్ శాఖ ఏఈల బాధ్యతల స్వీకరణ



ఆత్మకూరు: విద్యుత్‌శాఖ ఆత్మకూరు రూరల్ ఏఈగా డీ ప్రవీణ్‌కుమార్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో డిప్యూటేషన్‌పై రూరల్ ఏఈగా పనిచేస్తున్న వ్యక్తి గత నెలలో సస్పెన్షన్ గురైన విషయం తెలిసిందే. ఆయన సస్పెన్షన్‌ను రద్దు చేయించుకుని తాను పనిచేస్తున్న ఉదయగిరికి బదిలీ అయినట్లు సమాచారం. ఆయన స్థానంలో ప్రవీణ్‌కుమార్‌ను నియమించగా బాధ్యతలు స్వీకరించారు.



చేజర్ల: మండల విద్యుత్ శాఖ నూతన ఏఈగా లిఖిత్‌రెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారులకు మెరుగైన విద్యుత్ సరఫరాను అందించేందుకు కృషి చేస్తామన్నారు. ప్రజలు విద్యుత్ బకాయిలను సకాలంలో చెల్లించి సంస్థకు సహకరించాలని కోరారు.

గిరిజనులకు ఆహారం పంపిణీ



అల్లూరు: స్థానిక రాజారామిరెడ్డికాలనీలో నివాసం ఉంటున్న గిరిజనులకు కేఎస్సార్ ఫౌండేషన్ చైర్మన్ కందల రాజారెడ్డి గురువారం ఆహారం పంపిణీ చేశారు. వర్షాలకు వంట చేసుకోలేక ఇబ్బందులు పడుతున్న గిరిజనులకు తహసీల్దార్ లక్ష్మీనారాయణ సూచనల మేరకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్న భోజనం ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఆర్ఐ ప్రభుదీప్, గిరిజన నాయకుడు దాసరి పోలయ్య, ట్రస్ట్ సభ్యులు జోసఫ్, కమల్‌సింగ్, మల్లిసింగ్, ప్రసాద్‌రెడ్డి, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం

వరికుంటపాడు : ఆశ్వీయుజ మాస పౌర్ణమిని పురస్కరించుకుని వరికుంటపాడులోని సాయిబాబా ఆలయంలో గురువారం విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు. భక్తులకు సుంకర సోదరులు అన్నప్రసాద వితరణ చేశారు.

రూ.40 లక్షలతో సీసీరోడ్ల నిర్మాణం



కొండాపురం: మండలంలోని గొట్టిగుండాల ఉప్పలూరు, చింతలదేవి పంచాయతీల్లో రూ.40 లక్షలతో సిమెంట్ రోడ్ల నిర్మాణానికి ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ గురువారం శంకుస్థాపన చేశారు.అనంతరం చింతలదేవిలోని నేషనల్ కామధేను ప్రాజెక్ట్‌ను సందర్శించారు. ఆయన వెంట టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

మహిళా లోకానికే అవమానం

కావలి : ప్రభుత్వం ప్రైవేట్ సిండికేట్ల ద్వారా మద్యం వ్యాపారానికి దారులను బార్లా తెరిచి మహిళలతో దరఖాస్తులు చేయించి మద్యం పాపాన్ని అంటకట్టడం విచారకరమని సామాజిక మహిళా కార్యకర్త, సారానిషేధ ఉద్యమకారిణి సీ శారద గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రైవేటు మద్యం వ్యాపారం ద్వారా ప్రభుత్వం సంపద సృష్టించేందుకు తెగించడం విచారకరమన్నారు. ప్రైవేటు మద్యం వ్యాపార విధానాన్ని వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మత్తు..చిత్తు

- యథేచ్ఛగా గంజాయి విక్రయాలు
- మత్తుకు బానిసై పెడదారి పడుతున్న యువత



పోలీసుల అదుపులో గంజాయి సేవించి పానీపూరి వ్యాపారిపై దాడికి పాల్పడిన యువకుడు (ఫైల్)

ఆత్మకూరు: గంజాయి విక్రయాలు చాపకింద నీరులా విస్తరిస్తున్నాయి. నగరాల నుంచి పట్టణాలు, గ్రామాలకు గంజాయి మత్తు పాకుతోంది. ఫలితంగా విద్యార్థులు, యువత గంజాయికి బానిసై తమ ఉజ్వల భవిష్యత్తును నాశనం చేసుకుంటూ తల్లిదండ్రులను ఆందోళనలకు గురిచేస్తున్నారు. ఆత్మకూరు మున్సిపల్ పరిధిలో గంజాయి విక్రయాలు యథేచ్ఛగా సాగుతుండడం అలజడి రేపుతోంది. కొందరు గుట్టుచప్పుడు కాకుండా బెంగళూరు, హైదరాబాద్, తదితర ప్రాంతాల నుంచి గుట్టుచప్పుడు కాకుండా వివిధ మార్గాల్లో తీసుకొచ్చి యువతను లక్ష్యంగా చేసుకుని విక్రయాలు చేస్తున్నారు. మున్సిపల్ పరిధిలోని పలు చోట్ల యువత గంజాయి సేవిస్తూ దర్శనమిస్తున్నారు. తొలుత సిగరెట్లతో మొదలు పెట్టి చివరకు గంజాయి సేవించే వరకు చేరుకుంటున్నారు. ఎవరికీ అనుమానం రాకుండా సిగరెట్లలోని పొగాకు పొడిని ఖాళీ చేసి అందులో గంజాయి పొడిని నింపి తాగుతున్నారు. మరికొందరు 'ఓసీబీ' పేపర్‌ను సిగిరెట్‌లా చుట్టి అందులో గంజాయి పొడిగిని తాగుతున్నారు. సిగిరెట్ త్వరగా కాలిపోయి సెకండ్ల వ్యవధిలో వృథావుతుందని ఓసీబీ పేపర్‌లో చుట్టి తాగుతున్నారు. కొన్ని కంపెనీల సిగిరెట్‌లు ఈ ఓసీబీ పేపర్ రంగులా ఉండడంతో చూసే వారు సిగిరెట్ తాగుతున్నారని భావిస్తున్నారు. గంజాయి మత్తు డిగ్రీ విద్యార్థుల నుంచి ఇంటర్మీడియట్ విద్యార్థులకు పాకినట్లుగా తెలుస్తోంది. ఇలా యువత గంజాయి మత్తులో పడి తమ ఉజ్వల భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారు.

- మున్సిపల్ పరిధిలోని జ్యోతినగర్‌లో చిన్నచిన్న ప్యాకెట్ల రూపంలో గంజాయిని గుట్టుచప్పుడు కాకుండా విక్రయిస్తున్నట్లు సమాచారం.
- రెండు రోజుల క్రితం జ్యోతినగర్‌లో గంజాయి కొనుగోలు చేసి సేవించిన ఓ యువకుడు మత్తులో పానీపూరి విక్రయించే చిరువ్యాపారిపై దాడికి పాల్పడ్డాడు. అనంతరం తాను నివాసం ఉంటున్న టిడ్కో ఇళ్ల వద్ద నానా హంగామా సృష్టించి తండ్రిపై దాడికి పాల్పడ్డాడు. ఆ తరువాత తన వేలును కోసుకున్నాడు.
- ఇటీవల మున్సిపల్ పరిధిలోని యడవల్లిరోడ్డు సమీపంలోని జామాయిల్ తోటలు, బస్టాండ్ సమీపంలోని సినిమాహాలు వెనుక వైపున ఉన్న పొలాలు, చెరువు వద్ద గంజాయి సేవిస్తూ పలువురు యువకులు పట్టుబడ్డారు.
- రెండు నెలల క్రితం మర్రిపాడు మండలం డీసీపల్లికి చెందిన యువకుడు గంజాయిని తరలిస్తూ ప్రకాశం జిల్లా సింగరాయకొండ వద్ద పోలీసులకు పట్టుబడ్డాడు. అతని వద్ద 15 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. హైదరాబాదు నుంచి గంజాయిని తెచ్చి విక్రయిస్తున్నట్లుగా పోలీసుల విచారణలో తేలింది.
- గతంలో చేజర్లకు చెందిన ఓ వ్యక్తి ఆత్మకూరులోని ఓ దుకాణంలో పనిచేస్తూ గంజాయిని చిన్నచిన్న ప్యాకెట్ల రూపంలో బైపాస్‌రోడ్డులో విక్రయించేవాడు. ఓ సారి పోలీసులు పట్టుకున్నా మరుసటి రోజే బయటకు వచ్చేశాడు. తిరిగి యథావిధిగా గంజాయి విక్రయాలు సాగించాడు. ప్రస్తుతం అతను ఊరి వదిలి వెళ్లిపోయినా గంజాయి విక్రయాలు సాగుతున్నాయి.



గంజాయి ప్యాకెట్లు

రవాణా ఇలా..

హైదరాబాద్, బెంగళూరు నుంచి ఆత్మకూరుకు వచ్చే బస్సుల్లో సాధారణ ప్రయాణికుల మాదిరిగా వస్తూ గంజాయిని తరలిస్తున్నారు. హైదరాబాద్ నుంచి ఆత్మకూరుకు బస్సుల్లో వచ్చేవారు ముందే వింజమూరు మార్గంలోని పానుగోడు వద్ద దిగుతున్నారు. తాము వెంట తెచ్చుకున్న గంజాయి లగేజీని సాధారణ పార్శిల్లా మాదిరిగా దించుకుని తీసుకొస్తున్నారు. గతంలో పానుగోడులో ఓ ఇంటిని అద్దెకు తీసుకుని గంజాయిని నిల్వ ఉంచి చిన్నచిన్న ప్యాకెట్లుగా తయారు చేసి వాటిని ఏఎస్‌పేట, ఆత్మకూరు ప్రాంతాల్లో విక్రయించిన విషయం పోలీసుల విచారణలో వెలుగు చూసింది. దీంతో కొద్ది రోజులు హైదరాబాద్ నుంచి వచ్చే బస్సులపై నిఘా ఉంచారు. అనంతరం పట్టించుకోకపోవడంతో గంజాయి రవాణా యథావిధిగా సాగుతోంది. హైదరాబాదు నుంచి ఏఎస్‌పేటకు వచ్చే ప్రయాణికుల్లా పలువురు గంజాయి తెస్తున్నట్లు సమాచారం. హైదరాబాదుకు చెందిన యువకులు ఎక్కువ మంది ఏఎస్‌పేటలో రోజుల తరబడి దర్గా వద్ద సేవ పేరుతో ఉంటుంటారు. వారికి గంజాయి స్థానికంగానే లభిస్తున్నట్లు సమాచారం.

విక్రయాలు ఇలా..

పట్టణానికి చెందిన కొందరు గంజాయిని గుట్టుచప్పుడు కాకుండా పెద్దమొత్తంలో దిగుమతి చేసుకుంటున్నారు. అనంతరం 10, 50, 100 గ్రాముల ప్యాకెట్లుగా సిద్ధం చేసి రూ.100 నుంచి 1000 వరకు విక్రయాలు చేస్తున్నారు. పోలీసుల దాడుల్లో గంజాయి సేవించే వారే పట్టుబడుతున్నారే తప్ప, వారికి విక్రయించే వారిని పట్టుకున్న దాఖలాలు లేవు. పోలీసులు ప్రత్యేక దృష్టి సారించి గంజాయి ఎక్కడి నుంచి సరఫరా అవుతుంది, ఎవరు విక్రయిస్తున్నారనే కోణంలో లోతుగా విచారణ జరిపితే నిజాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. చాపకింద నీరులా విస్తరిస్తున్న గంజాయి విక్రయాలను పోలీస్, ఎక్సైజ్ అధికారులు సమన్వయంతో అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

గంజాయి విక్రయాలపై నిఘా

> మున్సిపల్ పరిధిలో గంజాయి విక్రయాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశాం. నిందితులను పట్టుకుని గంజాయి విక్రయాలను పూర్తిస్థాయిలే అరికట్టేందుకు చర్యలు తీసుకుంటాం.
>
> – కే వేణుగోపాల్, ఆత్మకూరు డీఎస్పీ

వరద బాధితులకు విశ్వోదయ వితరణ



కావలి: విజయవాడ వరద బాధితుల కోసం విశ్వోదయ విద్యా సంస్థలు సీఎం సహాయ నిధికి రూ.లక్ష విరాళాన్ని ప్రకటించాయి. విశ్వోదయ విద్యా సంస్థలకు చెందిన విద్యార్థులు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది సమకూర్చిన ఈ మొత్తాన్ని చెక్కు రూపంలో జవహర్ భారతి డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పీ సుబ్రహ్మణ్యంనాయుడు కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డికి గురువారం అందజేశారు. స్వయం ఉపాధి కోర్సుల డైరెక్టర్ డాక్టర్ ఆర్ మాల్యాద్రి, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ శామ్యూల్‌రాజ్, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ బ్యూలా, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్స్ పీ నాగేశ్వరరావు, ఎస్కే ఆయూబ్‌అహ్మద్, డిగ్రీ కళాశాల లైబ్రేరియన్ బ్రహ్మానందం తదితరులు పాల్గొన్నారు.

బస్‌షెల్టర్ పక్కనే మద్యం దుకాణం



ఆత్మకూరు: మున్సిపల్ పరిధిలోని నెల్లూరుపాళెం వద్ద బస్‌షెల్టర్ పక్కనే మద్యం దుకాణం ఏర్పాటు చేస్తుండడంపై స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. జాతీయ రహదారి పక్కనే మద్యం దుకాణాలు ఏర్పాటు చేయకూడదనే నిబంధన ఉంది. అయినా ఖాతర్ చేస్తూ లాటరీలో దుకాణం దక్కించుకున్న సిండికేట్ వ్యక్తులు జాతీయ రహదారికి కేవలం పది మీటర్ల దూరంలో బస్‌షెల్టర్ పక్కనే ఉన్న ఓ దుకాణంలో ఏర్పాటుకు అన్ని సిద్ధం చేస్తున్నారు. దీంతో స్థానికులు అభ్యంతరం తెలుపుతున్నారు. ఈ విషయమై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు వారు తెలిపారు. గతంలో 2016లో నెల్లూరుపాళెం సెంటర్ సమీపంలో వింజమూరు రోడ్డులో మద్యం దుకాణాన్ని ఏర్పాటు చేయగా మూయించేసినట్లు చెప్పారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు మద్యం దుకాణమే ఏర్పాటు చేయలేదని తెలిపారు. ఇప్పటికైనా మద్యం దుకాణం ఏర్పాటును నిర్వాహకులు విరమించుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

బోర్లకు మరమ్మతులు

వరికుంటపాడు : తూర్పురొంపిదొడ్ల పంచాయతీ పరిధిలోని మరమ్మతులకు గురైన మంచినీటి బోర్లకు గురువారం మరమ్మతులు చేపట్టారు. బోర్లు మరమ్మతులకు గురై ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడుతున్న విషయాన్ని సర్పంచ్ నాగేశ్వరి అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో బోర్ మెకానిక్ రాజారత్నం గ్రామానికి చేరుకుని మరమ్మతులు చేపట్టి సమస్యను పరిష్కరించారు. స్థానికులు రామకృష్ణ, నాగయ్య, బ్రహ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ట మహోత్సవం

కావలి : దగదర్తి మండలం నారాయణపురంలోని మాధవయ్యస్వామి దేవస్థానంలో విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ట మహోత్సవాన్ని గురువారం వైభవంగా నిర్వహించారు. కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి ఎమ్మెల్యేకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులు శాలువాతో ఎమ్మెల్యేను సత్కరించారు. తొలుత ఎమ్మెల్యేకు గ్రామస్తులు ఘన స్వాగతంపలికారు. టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా వాల్మీకి మహర్షి జయంతి



ఉదయగిరిలో వాల్మీకి మహర్షికి నివాళులర్పిస్తున్న వాల్మీకి సంఘ నాయకులు



వరికుంటపాడు మండల భోగ్యంవారిపల్లెలో..



ఆత్మకూరు: డీఎస్పీ కార్యాలయంలో..

ఉదయగిరి: రామాయణ మహాకావ్యాన్ని రచించిన ఆదికవి వాల్మీకి మహర్షి జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని వాల్మీకివీధిలో వాల్మీకి సంఘ నాయకులు, తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ సుభద్ర, మేకపాటి గౌతమ్‌రెడ్డి వ్యవసాయ కళాశాలలో అసోసియేట్ డీన్ డాక్టర్ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

వింజమూరు(ఉదయగిరి): వింజమూరులోని ఎమ్మెల్యే కాకర్ల క్యాంపు కార్యాలయంలో వాల్మీకి సంఘ నాయకుల ఆధ్వర్యంలో వాల్మీకి జయంతి వేడుకలను నిర్వహించారు. ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పాల్గొని వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేశారు.

సీతారామపురం: మండల పరిషత్ కార్యాలయంలో కార్యాలయంలో ఎంపీడీఓ భాస్కర్ ఆధ్వర్యంలో వాల్మీకి మహర్షి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు పంచాయతీ కార్యదర్శులు, మండల పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.

వరికుంటపాడు : మండలంలోని భోగ్యంవారిపల్లెలో వాల్మీకి సంఘ నాయకుల ఆధ్వర్యంలో వాల్మీకి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. సంఘ నాయకులు మోహన్‌రాజా, బీ వెంకయ్య, మార్కండేయులు, ఎస్ రమణయ్య, మురళీకృష్ణ, రాధాకృష్ణ, చిన్న కోటయ్య, హనుమంతు, కొండలరావు పాల్గొన్నారు

అల్లూరు: మండల తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ లక్ష్మీనారాయణ, మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ రజనీకాంత్, ఎంపీపీ శశిరేఖ వాల్మీకి మహర్షి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. డీటీ ప్రవీణ్‌కుమార్, ఈఓపీఆర్డీ వీరేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు: పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో వాల్మీకి మహర్షి చిత్రపటానికి ఆత్మకూరు ఆర్డీఓ బీ పావని పూలమాలలు వేసి నివాళులర్పించారు. వాల్మీకి జీవిత చరిత్రను గుర్తుచేశారు. వేటగాడిగా ఉండి పరిణితి చెంది తపస్సుతో వాల్మీకిగా పునర్జన్మ సాధించి రామాయణాన్ని రచించారన్నారు. ఆత్మకూరు డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీవేణుగోపాల్, పోలీసు స్టేషన్‌లో సీఐ జీ గంగాధర్ ఆధ్వర్యంలో వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎస్సైలు షేక్ జిలానీ, సాయిబాబా, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఆత్మకూరురూరల్: మండల పరిషత్ కార్యాలయంలో వాల్మీకి మహర్షి చిత్రపటానికి పంచాయతీరాజ్ శాఖ అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జెడ్పీ సీఈఓ మోహన్‌రావు, డీఎల్‌డీఓ రమణయ్య, ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్, ఈఓపీఆర్డీ డేవిడ్, తదితరులు పాల్గొన్నారు.

మర్రిపాడు: మండల తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ స్వప్న ఆధ్వర్యంలో వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. డీటీ అనిల్, కార్యాలయ సిబ్బంది, వీఆర్వోలు పాల్గొన్నారు.

సంగం: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ షాలెట్, తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ సోమ్లానాయక్ వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏఓ శైలజ, తదితరులు పాల్గొన్నారు.

మర్రిపాడు: మండలంలోని పొంగూరులో మహర్షి వాల్మీకి జయంతి వేడుకలను నల్లబోతుల రమేష్, వెంకటరమణయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. చిన్నారులతో కేక్ కట్ చేయించి పంచిపెట్టారు. గ్రామ పెద్దలు, మహిళలు, చిన్నారులు పాల్గొన్నారు.



మర్రిపాడు తహసీల్దార్ కార్యాలయంలో..



సీతారామపురం మండల పరిషత్ కార్యాలయంలో..



అల్లూరు మండల పరిషత్ కార్యాలయంలో..



ఆత్మకూరు ఆర్డీఓ కార్యాలయంలో..



సంగం మండల పరిషత్ కార్యాలయంలో..



ఆత్మకూరు మండల పరిషత్ కార్యాలయంలో..



వింజమూరులో నివాళులర్పించిన ఎమ్మెల్యే కాకర్ల



ఉదయగిరిలోని వ్యవసాయ కళాశాలలో..



మర్రిపాడు మండలం పొంగూరులో..

కొనసాగుతున్న నల్లవాగు ఉధృతి



నల్లవాగును పరిశీలిస్తున్న తహసీల్దార్ మస్తానయ్య

చేజర్ల: మండలంలోని నల్లవాగు ఉధృతి కొనసాగుతోంది. వాయుగుండం ప్రభావంతో కురిసిన వర్షాలకు నల్లవాగు పొంగి ప్రవహించడంతో ఎర్రబల్లి గ్రామం నుంచి తూర్పుకంభంపాడు, యనమదల గ్రామాలకు బుధవారం ఉదయం నుంచి రాకపోకలు నిలిచిపోయాయి. కలువాయి నుంచి కాకివాయి మీదుగా చేజర్లకు పోయే మార్గంలోనూ చప్టాపై నీరు ప్రవహిస్తుండడంతో రాకపోకలు నిలిచిపోయాయి. చేజర్ల నుంచి కలువాయికి కూడా రాకపోకలు స్తంభించాయి. గురువారం వర్షం కాస్తా తెరిపిచ్చినప్పటికీ వాగులు కొనసాగడంతో రాకపోకలు స్తంభించాయి. తహసీల్దార్ మస్తానయ్య, ఎస్సై ప్రభాకర్ నల్లవాగును పరిశీలించారు. వాగు ఉధృతి తగ్గేవరకు ఎవరూ వెళ్లకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. కాగా చేజర్ల–సంగం మార్గంలో గొల్లపల్లి వద్ద ఉన్న పందల వాగు ఉధృతి గురువారం మధ్యాహ్నం నుంచి తగ్గడంతో రాకపోకలు కొనసాగాయి.

పారిశుద్ధ్య లోపం తలెత్తకుండా చర్యలు

జెడ్పీ సీఈఓ మోహన్‌రావు



ఎంపీడీఓతో మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ మోహన్‌రావు

సంగం: వర్షాలు పడుతున్న నేపథ్యంలో గ్రామాల్లో పారిశుద్ధ్య లోపం తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నామని జెడ్పీ సీఈఓ మోహన్‌రావు తెలిపారు. గురువారం ఆయన మండల పరిషత్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఎంపీడీఓ షాలెట్‌తో సమావేశమై పారిశుద్ధ్యం మెరుగునకు చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలకు సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించినట్లు తెలిపారు. ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలని సూచించామన్నారు. తొలగించి ప్రజలు కాచి చల్లార్చిన నీటినే తాగాలని సూచించారు. 15వ ఆర్థిక సంఘం నిధులను ఖర్చు చేసేందుకు స్థానిక ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహిస్తామని తెలిపారు.

ప్రభుత్వ లేఅవుట్లలో సమగ్ర వసతులు



ఆత్మకూరురూరల్: ప్రభుత్వ లేఅవుట్లలో ఇళ్లు నిర్మించుకుంటున్న లబ్ధిదారులకు సకాలంలో బిల్లులు మంజూరు చేయడంతో పాటు సమగ్ర వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నామని గృహ నిర్మాణ శాఖ జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ వేణుగోపాల్ తెలిపారు. మండలంలోని బోయలచిరివెళ్ల పంచాయతీ పరిధిలోని లేఅవుట్లలో వివిధ దశల్లో ఉన్న గృహ నిర్మాణాలను గురువారం ఆయన క్షేత్ర పరిశీలన చేశారు. విద్యుత్, తాగునీరు, రోడ్లు, తదితర సౌకర్యాలను కల్పించాలని ఏఈ శరత్‌ను ఆదేశించారు. ఆయన వెంట సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లు ఉన్నారు.

పచ్చిక కోసం వెంపర్లాట



వాయుగుండం ప్రభావంతో కురిసిన వర్షాలకు కావలి మండలంలోని పలు గ్రామాల్లో పొలాలు జలమయమయ్యాయి. ఎక్కడా పచ్చిక జాడ కనిపించడం లేదు. దీంతో పాడి పశువులు వర్షపు నీటిలోనే మేత కోసం వెంపర్లాడుతూ కనిపించాయి. -కావలి

వర్షాలకు దెబ్బతిన్న పంటల పరిశీలన



సీతారామపురం: నేలవాలిన వరిపంటను పరిశీలిస్తున్న ఏఓ చెన్నారెడ్డి



మర్రిపాడు: వరి పంటను పరిశీలిస్తున్న ఏఓ



అనుమసముద్రంపేట:అవగాహన కల్పిస్తున్న ఏఓ

సీతారామపురం: మండలంలో ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షం ధాటికి దెబ్బతిన్న వరిపైరును మండల వ్యవసాయాధికారి చెన్నారెడ్డి గురువారం పరిశీలించారు. నూతివారికొట్టాలులో వెన్ను దశలో నేలవాలిన వరిపైరును పరిశీలించారు. పంట నష్టాన్ని ప్రాథమికంగా అంచనా వేసి ఉన్నతాధికారులకు నివేదించి నష్టపరిహారం అందేలా చూస్తామని తెలిపారు. ఆయన వెంట వీఏఏ వెంకటేశ్వర్లు ఉన్నారు.

వరికుంటపాడు : మండలంలో ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు లోనైన పంటలను ఏఓ రవికుమార్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 700 ఎకరాల్లో మినుము, 350 ఎకరాల్లో కంది సాగు చేసినట్లు తెలిపారు. అధిక వర్షాలతో భూమిలో తేమ శాతం ఎక్కువగా ఉండడం వల్ల మొక్కలు పోషకాలను సంగ్రహించే శక్తిని కోల్పోయి పసుపు రంగులోకి మారి చనిపోయే అవకాశం ఉందన్నారు. అందువల్ల మొక్కలకు పిచికారీ రూపంలో పోషకాలను అందించాలని సూచించారు. లీటరు నీటికి 10 గ్రాముల 19:19:19 లేదా 10 గ్రాముల పొటాషియం నైట్రేట్ (13-0-45)తో పాటు 3 గ్రాముల అన్నభేది, అర గ్రాము నిమ్మ ఉప్పు కలిపి మొక్కలపై పిచికారీ చేయడం ద్వారా పంటలను కాపాడుకోవచ్చని తెలిపారు. వీఏఏలు కూండ్ల చంద్రశేఖర్, కనసాని వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మర్రిపాడు: మండలంలోని సింగనపల్లి, కంపసముద్రంలో వరి, మిరప పంటలను ఏఓ ఎస్ రామ్మోహన్ పరిశీలించారు. ఎకరాకు 5 సెంట్లలో నారుమడి పోసుకోవాలని, వరి నాటే వారం రోజుల ముందు కేజీ కార్బ్యూరాన్ 3 జీ గుళికలు వేసుకుంటే కాండం తొలుచు పురుగు, ఉల్లికోడు తెగుళ్ల నుంచి నెల రోజుల వరకు పంటను కాపాడుకోవచ్చని తెలిపారు. వరి నాటే ముందు దుక్కిలో పది కేజీల జింక్ సల్ఫేట్ వేసుకోవాలని సూచించారు. పైపాటుగా భాస్వరం ఎరువులు వేసుకోరాదని తెలిపారు.

అనుమసముద్రంపేట: పెద్దబ్బీపురం, గుడిపాడు గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఏఓ రజని పాల్గొని విత్తనశుద్ధిపై అవగాహన కల్పించారు. సుడోమోనాస్ 8 గ్రాములను కిలో విత్తనానికి కలిపి శుద్ధి చేసుకోవడం ద్వారా తెగుళ్లను నివారించవచ్చని తెలిపారు. రబీలో కేఎన్ఆర్1638, ఆర్ఎన్ఆర్ 15048 రకాల వరిని సాగుచేసుకోవాలని సూచించారు. ఏఈఓ కె చిరంజీవి, వీఏఏ మంజుల, బీ ప్రసాద్ పాల్గొన్నారు.